క్లుప్తంగా

కొల్హాపురి మహాలక్ష్మికి పూజలు


అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి భక్తులు కానుక రూపంలో తీసుకొచ్చిన పట్టువస్త్రాలు, వడి బియ్యం కట్టి వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. ప్రత్యేక పూజ రోజు కావడంతో అమ్మవారిని కొలిచే గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

పరిగి: మండలంలోని మోదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పాఠశాలలో పని చేసిన హెచ్ఎం నరసింహమూర్తి, నారాయణస్వామి, గురుమూర్తి, జీఎస్ లక్ష్మి, కిరణ్‌కుమార్, కుమార్, రామాంజినేయులు సేవలను కొనియాడారు. గత ఎనిమిదేళ్లుగా పాఠశాలలో విధులు నిర్వర్తించి, అనేక విధాలుగా విద్యాభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయుల సేవలను మరవలేమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురురాజారావు, మదనమోహన రెడ్డి, రాజశేఖర్, రామారెడ్డి, లక్ష్మీదేవమ్మ, విజయ్‌కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడికి కృషి


పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ శ్రీకృష్ణ

పరిగి: మండల నూతన వ్యవసాయాధికారిగా శ్రీకృష్ణ మంగళవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. ఆయనతో పాటు నూతన ఏఈఓగా మోహన్‌రెడ్డి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ రంగంలో సాగుపై అవగాహన కార్యక్రమాల నిర్వహణతో పాటు అధిక దిగుబడి సాధనకు అవసరమైన మెలకువలు, సూచనలను అందిస్తామన్నారు. అంతకు ముందు పరిగిలోని రైతు సేవాకేంద్రంలో మండలంలోని అన్ని సచివాలయాల అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ సహాయకులతో సమావేశమై రైతులకు అందుబాటులో ఉండి, అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం హొన్నంపల్లి, ధనాపురంలో పొలంబడి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సజావుగా ప్రవేశ పరీక్ష

అమరాపురం: మండల పరిధిలోని హాలుకూరు గ్రామ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ పాఠశాలలో 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి మంగళవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష సజావుగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు మోడల్ పాఠశాలలో పరీక్షలను రాశారు. పరీక్షలను ప్రిన్సిపాల్ హనుమన్న, ఉపాధ్యాయులు మంజునాథ ఆధ్వర్యంలో నిర్వహించారు. 6వ తరగతికి 21 మంది, 7వ తరగతికి 21, 8వ తరగతికి 27, 9వ తరగతి ప్రవేశానికి 11 మంది పరీక్షలకు హాజరైనట్లు పేర్కొన్నారు.

నాసిరకంగా ప్రహరీ నిర్మాణం


నిర్మాణంలో ఉన్న ప్రహరీ

పావగడ: తాలూకాలోని కొడమడుగు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణం నాసిరకంగా నిర్మిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నరేగా పథకం కింద రూ.4 లక్షలతో నాణ్యతా ప్రమాణాలు పాటించి సిమెంటు, సిసలైన బండ రాళ్లతో నిర్మించాల్సి ఉంది. అయితే ప్రభుత్వ పాఠశాల భవన ప్రహరీ పునాదిని అడుగు భాగంలో మాత్రం అడపా దడపా సిమెంటుతో నిర్మించి పై భాగంలో ఒట్టి మట్టితో నిర్మిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పునాది నిర్మాణానికి సరిగా క్యూరింగ్ చేయక పోవడంతో పునాది చెదిరి పోతోందని చెబుతున్నారు. నరేగా అసిస్టెంట్ డైరెక్టర్, ఇంజినీర్ నిర్లక్ష్యమే కారణమంటున్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకొని పునాదిని నాణ్యంగా నిర్మించేలా చూడాలన్నారు.

కూటమి నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం



మడకశిరలో అసంపూర్తిగా ఉన్న జెడ్పీ బాలికోన్నత పాఠశాల భవనాలు

- అసంపూర్తిగా మడకశిర బాలికోన్నత పాఠశాల భవనాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే 90 శాతం పనులు పూర్తి
- 10 శాతం పనులపై దృష్టిసారించని కూటమి ప్రభుత్వం
- ఇరుకు గదులతో విద్యార్థినుల తీవ్ర ఇబ్బందులు

మడకశిర: నియోజకవర్గంలోనే మడకశిర కేంద్రంగా ఉన్న ఒకే ఒక జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు పక్కా భవనాలు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ నడిబొడ్డులో ఉన్న పాఠశాలను కొన్ని దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఈ పాఠశాలకు పూర్తిస్థాయిలో భవనాలు లేకపోవడం దురదృష్టకరమని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ హయాంలో భవనాల కూల్చివేత

జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు గతంలో భవనాలు ఉండేవి. 2014 – 19 సంవత్సరాల మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఈ భవనాలను కూల్చివేశారు. పట్టణ సుందరీకరణ పేరుతో రోడ్ల విస్తరణలో భాగంగా స్కూల్ భవనాలను కూల్చి వేశారు. దీంతో బాలికోన్నత పాఠశాలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఓ భవనంలోకి మార్చారు. పట్టణ నడిబొడ్డున ఉన్న పాఠశాలను కిలోమీటర్ దూరంలో ఉన్న భవనంలోకి మార్చడంతో విద్యార్థినులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రస్తుతం పట్టణానికి దూరంగా ఉన్న భవనంలో బాలికోన్నత పాఠశాలను నిర్వహిస్తుండడంతో బాలికలు అనేక కష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గత ప్రభుత్వంలో కొత్త భవనాల మంజూరు

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడగానే టీడీపీ హయాంలో కూల్చివేసిన భవనాల స్థలంలోనే మళ్లీ బాలికోన్నత పాఠశాల భవనాలను నిర్మించడానికి నిర్ణయం తీసుకుంది. ఉపాధి పథకం కింద భవనాల నిర్మాణానికి దాదాపు రూ.2 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది. ఈ నిధులతో భవనాల పనులను ప్రారంభించారు. ఆ తర్వాత ఈ నిధులు కూడా తక్కువ రావడంతో మళ్లీ రెండో విడత నాడు–నేడు పథకం కింద నిధులను మంజూరు చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ భవనాల పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. అయితే ప్రస్తుతం భవనాలు పూర్తికాక నిరుపయోగంగా మారాయి.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచింది. అయితే ఈభవనాల పనులను పూర్తి చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో 300 మందికి పైగా విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఇరుకైన భవనాల్లో పాఠశాలను నిర్వహిస్తుండడంతో బాలికల చదువులు ముందుకు సాగడం లేదని వాపోతున్నారు. పనులు పూర్తి చేయడానికి రూ.25 లక్షల వరకూ నిధులు కూడా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

మంత్రి లోకేష్‌కు విద్యార్థినుల లేఖ

పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థినులు భవనాల విషయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ కూడా రాశారు. ఆగిపోయిన తమ పాఠశాల భవనాలను పూర్తి చేసి ఇబ్బందులను తొలగించాలని లేఖలో కోరినట్లు చెబుతున్నారు. అలాగే సంబంధిత విద్యాశాఖ అధికారులకు కూడా లేఖ పంపినట్లు సమాచారం. అయినా కూటమి ప్రభుత్వంలో ఏమాత్రం కదలిక లేదు. స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా ఈ విషయంలో చొరవ తీసుకోవడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న స్కూల్ భవనాలు అసాంఘిక కార్యకలపాలకు నిలయంగా మారాయి. పట్టణ నడిబొడ్డున భవనాలు ఉండడంతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు.

భవనాలు పూర్తి చేయాలి



పట్టణంలో అసంపూర్తిగా ఉన్న బాలికోన్నత పాఠశాల భవనాలను పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం ఈభవనాలు అసంపూర్తిగా మిగిలిపోవడంతో నిధులు వృథాగా మారాయి. గత ప్రభుత్వంలోనే 90 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం మిగిలిన 10 శాతం పనులను పూర్తి చేసి భవనాలను ఉపయోగంలోకి తీసుకురావాలి.

– ధను, మడకశిర

ఇబ్బందులు తొలగించాలి



బాలికోన్నత పాఠశాలకు సరైన భవనాలు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం నిర్వహిస్తున్న పాఠశాల భవనాలు విద్యార్థినులకు సరిపోవడం లేదు. పాఠశాల పట్టణానికి దూరంగా ఉండడంతో విద్యార్థినుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినుల ఇబ్బందులను గుర్తించాలి. వెంటనే అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేసి విద్యార్థినులను ఆదుకోవాలి.

– గోపి, మడకశిర

అక్రమ కేసులపై కాదు పాలనపై దృష్టిపెట్టండి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రెంటపాళ్లలో వ్యక్తి మృతి చెందిన కేసుకు సంబంధించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమేనన్నారు. ప్రమాదవశాత్తూ సింగయ్య మృతి చెందడం బాధకమన్నారు. కానీ వాస్తవాలు తెలుసుకోకుండా కూటమి నాయకులు అధికారాన్ని అడ్డు పెట్టుకుని పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. జిల్లా పర్యటనకు వెళ్లినప్పుడు మాజీ ముఖ్యమంత్రికి పూర్తిస్థాయి భద్రత కల్పించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిది కాదా? అని ప్రశ్నించారు. వాహన డ్రైవర్‌ను అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాని వేధించడం సరైన పద్ధతి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టాలని సీఎం చంద్రబాబు పోలీసులపై ఒత్తిడి చేయడం మానుకొని పాలన దృష్టి పెట్టాలన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


సతీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని మడకశిర నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ నూతన కన్వీనర్‌గా నియమితులైన బోయ సతీష్‌కుమార్ తెలిపారు. నూతన కన్వీనర్‌ను మంగళవారం మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి వైఎస్ జగన్ కన్వీనర్ పదవిని ఇచ్చారని, ఆయన నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీని బలోపేతం చేస్తామన్నారు. తన ఎంపికకు సహకరించిన సమన్వయకర్త ఈరలక్కప్పకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ హనుమంతు, నాయకులు తిమ్మప్ప, రంగనాథ్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీమా చట్టాల సవరణ బిల్లు వద్దు


ఎల్ఐసీ ఆఫీసు వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

హిందూపురం: కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేలా నిర్ణయాలు తీసుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని ఎల్ఐసీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, ఉద్యోగుల సంఘం హిందూపూర్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బి.నరసింహులు పిలుపునిచ్చారు. సంఘం అధ్యక్షులు యల్.చంద్రకళ ఆధ్వర్యంలో స్థానిక ఎల్ఐసీ డివిజనల్ ఆఫీసు ఎదుట దేశవ్యాప్త పిలుపుమేరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో బీమా చట్టాల సవరణ బిల్లును ప్రవేశ పెట్టనున్నారని దాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎల్ఐసీలో ప్రభుత్వం తన వాటాలను ఉపసంహరించుకునే కార్యక్రమానికి మరోమారు ప్రయత్నించడం సరికాదన్నారు. ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో కొత్త పెన్షన్ విధానానికి స్వస్తిపలికి పాత పెన్షన్ విధానాన్ని అమలుకు సిద్ధపడుతున్నాయని చెప్పారు. ఎల్ఐసీలో కూడా అందరికీ పాత పెన్షన్ విధానమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు మధుసూదన్‌రావు, గంగాధర్, శ్రీలక్ష్మి, మాధురిబాయ్, మాధురిలత, జ్యోతిర్మయి, మాధవి, నాగారత్న, నాగరాజు, రామచంద్రప్ప, మనీష్ ప్రీతం, రవితేజ, పెన్షన్ యూనియన్ సభ్యులు నాగప్ప,నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ లక్ష్మీదేవి

పరిగి: ప్రభుత్వ విద్యాశాఖ నిబంధనల మేరకు ప్రైవేటు పాఠశాలల నిర్వహణ ఉండాలని, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే పాఠశాల గుర్తింపు రద్దుకు చర్యలు తీసుకుంటామని ఎంఈఓ లక్ష్మీదేవి తెలిపారు. ఇటీవల మండల కేంద్రంలోని బెల్లా పబ్లిక్ స్కూల్ యాజమాన్యం వైఖరిపై వచ్చిన ఆరోపణలపై మంగళవారం పాఠశాలకు వచ్చి విచారణ చేశారు. ఇందులో బాగంగా రికార్డుల నిర్వహణ, మౌలిక వసతుల కల్పనతో పాటు గదులు, పొల్యూషన్ సర్టిఫికెట్ తదితర అంశాలపై ప్రాథమిక తనిఖీ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ బెల్లా పబ్లిక్ స్కూల్ నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పెద్ద ఎత్తున తమకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. అధిక ఫీజు వసూలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. రికార్డుల నిర్వహణలో లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి తదుపరి చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

ధర్మ సందేశంతోనే విశ్వశాంతి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీరభద్ర శివాచార్య

పావగడ: ఆచారమే స్వర్గమని, అనాచారమే నరకమని, ధార్మిక శ్రద్ధ వహించడంతో పాటు విద్యకు ప్రాముఖ్యత కల్పించి సామాజిక ప్రగతిని సాధించే దిశగా అడుగులు వేయాలని కొరటగెరె సిద్ధరబెట్ట మఠాధిపతి వీరభద్ర శివాచార్య వీర శైవ లింగాయత సామాజిక వర్గానికి సూచించారు. స్థానిక ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో మంగళవారం జరిగిన బసవ జయంతి, రేణుకాచార్య యుగ మానోత్సవ సేవా దీక్ష వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ ధర్మ సందేశంతోనే విశ్వ శాంతి సాధ్యమన్నారు. అనంతరం 40 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. అలాగే వివిధ రంగాలలో సేవలందించిన 12 మంది ప్రముఖులను సన్మానించారు. స్థానిక సర్వ ధర్మ శాంతి పీఠాధిపతి రామమూర్తి పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్వహణకు భవనాల పరిశీలన


మున్సిపల్ కమిషనర్‌కు సూచనలిస్తున్న జేసీ శివనారాయణశర్మ

హిందూపురం టౌన్: పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం జాయింట్ కలెక్టర్, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్ శివనారాయణశర్మ తనిఖీ చేశారు. గ్రంథాలయ నిర్వహణకు సొంత భవనం లేకపోవడంతో వాటి కోసం ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. అలాగే ఇందిరాపార్కులో ఉన్న సచివాలయం భవనాన్ని గ్రంథాలయానికి కేటాయించాలని ఆయన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను ఆదేశించారు. ఈ సచివాలయ భవనానికి అనుగుణంగా మరొక రూమ్ నిర్మించి ఇవ్వాలని సూచించారు.

80 శాతం సబ్సిడీతో డ్రోన్

రొళ్ల: రైతులకు 80 శాతం సబ్సిడీతో వ్యవసాయశాఖ ద్వారా పంటసాగులో మందుల పిచికారీ కోసం డ్రోన్ పంపిణీ చేయనున్నట్లు ఏఓ వెంకటబ్రహ్మం తెలిపారు. రైతులు గ్రూపుగా ఏర్పడి స్థానిక బ్యాంక్‌లో రూ.5 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. తర్వాత ప్రభుత్వం రూ.5 లక్షలు బ్యాంక్ ఖాతాకు జమ చేస్తుందన్నారు. అనంతరం 80 శాతం సబ్సిడీతో డ్రోన్ పంపిణీ చేసిన తర్వాత మిగిలిన సబ్సిడీ మొత్తాన్ని రైతులు ఏర్పాటు చేసుకున్న గ్రూపు ఖాతాలోకి జమ చేస్తుందన్నారు. ఈ డ్రోన్ సహాయంతో వంద అడుగుల ఎత్తులో ఉన్న వక్క చెట్లతో పాటు పూత దశలో మామిడి తోటలకు, వేరుశనగ, మిరప, దోస తదితర పంటలకు సులువుగా మందులు పిచికారీ చేయవచ్చన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మవరం రూరల్: గరుడంపల్లి పొలాల్లోని పేకాట స్థావరంపై మంగళవారం దాడులను నిర్వహించినట్లు ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.6,200 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

పైపులైన్ ఏర్పాటు


ఇందిరమ్మ కాలనీకి పైపులైన్ ఏర్పాటు చేసిన దృశ్యం

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురం ఇందిరమ్మ కాలనీలో తాగునీటి కోసం పైపులైన్‌ను కార్యదర్శి సుధాకర్, సర్పంచ్ వాగేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కాలనీలో 500కు పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అయితే తాగునీటి అవసరం అధికంగా ఉండటంతో సర్పంచ్ దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. స్పందించిన ఆయన కార్యదర్శి సుధాకర్‌తో మాట్లాడి వెంటనే పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటిని అందించారు.

నీళ్ల ట్యాంకర్ బోల్తా


జాతీయ రహదారిపై బోల్తా పడిన నీళ్ల ట్యాంకర్

చిలమత్తూరు: మండల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారి థామస్ మన్రో తోపు సమీపంలో టెక్స్‌పోర్ట్ గార్మెంట్స్ ఎదురుగా నీళ్ల ట్యాంకర్ బోల్తాపడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు వివరాల మేరకు .. మిత్ర వాటర్ ప్లాంట్ నుంచి నీళ్లను నింపుకొని కొడికొండ చెక్‌పోస్ట్ వైపునకు వచ్చే క్రమంలో లారీ వేగంగా ఢీకొట్టడంతో ట్యాంకర్‌తో సహా ట్రాక్టర్ బోల్తాపడింది. ప్రమాదంలో ట్రాక్టర్ నుజ్జు నుజ్జు కాగా డ్రైవర్ శ్రీరాములు ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

ఈ పంట నమోదు తప్పనిసరి


రైతులకు సూచనలిస్తున్న ఏఓ విజయ భారతి

సోమందేపల్లి: ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలని ఏఓ విజయ భారతి సూచించారు. మంగళవారం మండలంలోని వెలిదడకల తుంగోడు గ్రామ పరిధిలోని వరి పంటలను పరిశీలించారు. వరి సాగులో సమగ్ర సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ కోసం ఎమామెక్టిక్ బెంజో యెంట్ ఎకరాకు 100 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అలేఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి ప్రభుత్వ ఎంపీపీ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్త గ్రామంలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, గౌరి, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

హిందూపురం: తూమకుంట వద్ద ఉన్న రెంబొమూర్తి లాడ్జీలో మంగళవారం వృద్ధుడు (73) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తెలిసింది. మృతుడు వాసవీ టెక్స్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. ఆయన గుండెనొప్పితో చనిపోయాడని అక్కడి వారు చెబుతున్నారని పోలీసులు తెలిపారు.

డిపోలో మెడికల్ క్యాంప్


హెల్త్ క్యాంపులో పాల్గొన్న ఆర్టీసీ ఆర్ఎం, డీఎం

హిందూపురం: ఆర్టీసీలో పనిచేసే డ్రైవర్లు, కండక్టర్లు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మెడికల్ ఆఫీసర్ అపర్ణ అన్నారు. ఆర్టీసీ డిపోలో ఈచెర్ మోటర్స్ ఆధ్వర్యంలో మంగళవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన, డీఎం శ్రీకాంత్‌తో పాటు డిపో ఉద్యోగులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు.

ఇళ్లు మంజూరు చేయండి


మంత్రి జమీర్ అహ్మద్‌తో సమావేశమైన ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: రాష్ట్ర గృహ నిర్మాణ, వక్ఫ్, మైనార్టీ శాఖల మంత్రి జమీర్ అహ్మద్‌తో స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, ఆయన తండ్రి, మాజీ మంత్రి వెంకటరమణప్ప మంగళవారం ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ వసతి యోజన కింద పావగడ పట్టణానికి చెందిన వారికి 500 ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా వైఎన్ హొసకోటలో షాదీ మహల్ నిర్మాణానికి రూ. 2 కోట్ల నిధుల మంజూరు చేయాలని కోరారు. అలాగే ఇప్పటికే మంజూరైన మైనార్టీ వర్గాల మురార్జి వసతి పాఠశాల గురించి చర్చించినట్లు ఎమ్మెల్యే వెంకటేశ్ 'సాక్షి'కి తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్లలో సౌకర్యాల కల్పనకు కృషి


ఆర్టీసీ ఉద్యోగులకు సూచనలిస్తున్న ఆర్ఎం మధుసూదన్

హిందూపురం: ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల సౌకర్యవంతంగా ఉండటానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్లలో 40 కుర్చీలు, 32 ఫ్యాన్లను ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్ అన్నారు. మంగళవారం హిందూపురం బస్టాండ్, బస్సు డిపోలను ఆయన తనిఖీ చేశారు. బస్టాండ్‌లో దుకాణాలను పరిశీలించి చెత్తను ఎక్కడి పడితే అక్కడ పారవేయకుండా చెత్త కుండీల్లో వేయాలని వ్యాపారులకు సూచించారు. అనంతరం డిపోలో ఉద్యోగులను సమావేశపరచి బస్సుల నిర్వాహణలో నాణ్యత, మెరుగైన సదుపాయలు, మైలేజీలను మెరుగుపర్చాడానికి సూచనలు చేశారు. ఏపీఎస్ఆర్టీసీ ద్వారా ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హిందూపురం డీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణకు యత్నం

సోమందేపల్లి: మండలంలోని మాగేచెరువు గ్రామంలోని శివప్పకు చెందిన ద్విచక్ర వాహనాన్ని ఇద్దరు యువకులు అపహరించే ప్రయత్నం చేసిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద ఆపి ఉన్న పల్సర్ ద్విచక్ర వాహనాన్ని మరో బైక్‌లో వచ్చిన యువకుడు తోసుకుంటూ వెళుతుండగా గ్రామస్తులు గమనించి నిలువరించారు. వాహన యజమానికి సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులుకు సమాచారం ఇవ్వగా వారిద్దరినీ అదుపులోకి తీసుకుని పోలీసులు స్టేషన్‌కు తరలించారు.